క్లుప్తంగా

22 నుంచి ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ముత్యాలమ్మ తల్లి

విజయనగరం రూరల్: కార్పొరేషన్ పరిధిలోని గాజులరేగ గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయ 71వ వార్షికోత్సవాలను ఈ నెల 22 నుంచి నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న తొలేళ్లు, 23న అమ్మవారి పండుగ, 24న అనుపోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి తీర్థ,ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు బడ్డుకొండ ఎన్నికల ప్రచారం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9.30 వరకు మండలంలోని పినతరిమి, బొప్పడాం, బుచ్చన్నపేట, పెద తరిమి, బొడ్డపేట, వల్లూరు, వెంకన్నపాలెం, మల్యాడ, ఆల్తిపాలెం, తమ్మాపురం, చనమళ్లపేట, బర్లపేట, గుషిణి గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. అభిమానులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



17వ సచివాలయం కార్యదర్శికి రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న వలంటీర్లు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. నగరంలోని 14వ డివిజన్ 17వ నంబర్ సచివాలయం పరిధిలోని పలువురు వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. అలాగే 32వ డివిజన్‌లో 17 మంది, 35 డివిజన్‌లో 17 మంది, 36వ డివిజన్‌లో 12 మంది, 45వ డివిజన్‌లో 10 మంది, 46వ డివిజన్‌లో 13 మంది, 47 డివిజన్‌లో 14 మంది, 50వ డివిజన్‌లో 18 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను ఆయా సచివాలయాల కార్యదర్శులకు అందజేశారు.

జాగ్రత్తలు తప్పనిసరి



అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఫైర్ సేఫ్టీ అధికారులు

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాల సమయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించడంతో పాటు సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి సోమేశ్వర రావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఫైర్ సేఫ్టీ అధికారులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వివాదరహితుడు బొత్స

- ఎలాంటి కేసులు లేవు
- ఎన్నికల కమిషన్‌కు అఫిడవిట్ సమర్పణ
- ప్రభుత్వ బకాయిలు జీరో

చీపురుపల్లి: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స సత్యనారాయణ వివాద రహితుడు. ఎలాంటి కేసులు లేవు. దాదాపు మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న ఆయనపై ఒక్క కేసుకూడా లేకపోవడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. మే 13న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.

అందులో ఆయన ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలతో కూడిన అఫిడవిట్ దాఖలు చేశారు. బొత్స సత్యనారాయణకు రూ.1,92,67,357, ఆయన భార్య బొత్స ఝాన్సీలక్ష్మికు రూ.2,32,20,212 వివిధ బ్యాంకుల్లో అప్పులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పొందుపరిచారు. అంతేకాకుండా ఇంతవరకు ప్రభుత్వానికి సంబంధించి ఎలాంటి పన్నులు, ఆదాయపు పన్నుల బకాయిలు లేకపోవడం గమనార్హం. మంత్రి బొత్సకు చరాస్తుల్లో భాగంగా రూ.3,78,39,513 , ఆయన భార్య బొత్స ఝాన్సీలక్ష్మికు రూ.4,75,35,148 , అవిభక్త కుటుంబానికి రూ.35,04,722 ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అగ్రికల్చర్ భూములకు సంబంధించి ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం మంత్రి బొత్సకు రూ.6,75,46,000, ఆయన భార్య పేరిట రూ.4,46,90,000, అవిభక్త కుటుంబానికి రూ.1,08,13,150 విలువైన భూములు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

తాగునీటి కష్టాలకు చెక్..

- వేసవిలో తాగునీటి సరఫరాకు చర్యలు
- వర్షాకాలంతో సమానంగా రోజు విడిచి రోజు నీరు
- మూడు పంప్‌హౌస్‌ల నుంచి ప్రతిరోజూ 27 మిలియన్ లీటర్ల నీరు పంపింగ్
- ఆంధ్ర రిజర్వాయర్ నుంచి చంపావతిలోకి నీరు మళ్లింపు
- 2019 ఎన్నికలకు ముందు ఐదు రోజులకొకసారి నీటి సరఫరా
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చొరవతో పుష్కలంగా తాగునీరు



కుళాయి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి (ఫైల్)

విజయనగరం: వేసవి వచ్చేసింది.. సూర్యభగవానుని ప్రచండ రూపం ప్రారంభమైంది. భూగర్భ జలాలు క్రమ క్రమంగా అడుగంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కార్పొరేషన్ యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ముందుస్తు ఆలోచనలతో మూడు లక్షలకు పైగా జనాభా కలిగిన విజయనగర నగర ప్రజలకు రానున్న మూడు నెలలు వర్షాకాలంతో సమానంగా మండు వేసవిలో సైతం రోజు విడిచి రోజు నీటి సరఫరా చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించింది. 2019 ఎన్నికలకు ముందు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా నగర ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడిన విషయం విదితమే. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటోంది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో సాధారణ రోజుల్లోగానే వేసవిలో కూడా రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు.

వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం..

50 డివిజన్‌లుగా విస్తరించిన విజయనగరం కార్పొరేషన్‌లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చేపట్టిన చర్యలు సత్ఫాలితాలనిచ్చాయి. ఇందులో భాగంగా గాజులరేగ, ధర్మపురి, కేఎల్‌పురం, బాలాజీనగర్, దాసన్నపేట, ఫూల్‌భాగ్ ప్రాంతాల్లో రూ.10 కోట్లతో 45 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌లు నిర్మించి ఆయా ప్రాంత ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు నగర వ్యాప్తంగా 18000 కుళాయిలు ఉండగా.... గడిచిన నాలుగున్నరేళ్లలో నూతనంగా 16,000 కుళాయి కనెక్షన్లు మంజూరు చేశారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి విజయనగరం వరకు 23 కిలోమీటర్ల పొడవున ఉన్న పైప్‌లైన్లను రూ. 63 కోట్లతో మార్పు చేసేందుకు నిధులు మంజూరు చేశారు.

27 మిలియన్ లీటర్ల నీరు పంపింగ్..

నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు నెల్లిమర్ల, రామతీర్థం, ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకాల నుంచి ప్రతిరోజూ 27 ఎంఎల్ నీటిని పంపింగ్ చేస్తున్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఆ నీటిని నగరంలోని 40 రిజర్వాయర్లకు పంపింగ్ చేసి అక్కడి నుంచి కుళాయిల ద్వారా ఒక రోజు 25 డివిజన్‌లకు, మరుచటి రోజు మరో 25 డివిజన్‌లకు నీటిని అందిస్తున్నారు. ఇందులో నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచినీటి పథకాల వద్ద 8 బావుల నుంచి 17 ఎంఎల్ నీటిని పంపింగ్ చేస్తుండగా.... ముషిడిపల్లి వద్ద ఉన్న 10 బావులు నుంచి మరో 10 ఎంఎల్ నీరు పంపింగ్ అవుతోంది. ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి వేసవి అంతా నీటిని పంపింగ్ చేసేందుకు అవసరమైన నిల్వలు ఉండగా.. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచి నీటి పథకాలు ఉండే చంపావతి నదిలో నీటి నిల్వలు అడుగంటిపోయాయి. దీంతో ఫిబ్రవరి 15న ఆంధ్ర రిజర్వాయర్ నుంచి నుంచి 43 కిలోమీటర్ల దూరంలో గల చంపావతి నదిలోకి నీటిని మళ్లించగా.... మార్చి మొదటి వారానికి ఆ నీరు చేరుకుంది. ఆంధ్ర రిజర్వాయర్ నుంచి వేసవి మొత్తానికి 50 క్యూసెక్కుల నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు.





వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాలు

ప్రాంతం: విజయనగరం కార్పొరేషన్	
మొత్తం డివిజన్‌లు:	50
నివసిస్తున్న జనాభా :	3 లక్షలకు పైగా
నగరానికి నీటిని అందించే పంప్ హౌస్‌లు :	3
ప్రతిరోజూ పంపింగ్ చేస్తున్న నీరు :	27 ఎంఎల్
నగరంలోని మొత్తం రిజర్వాయర్ల సంఖ్య :	40
నగరంలో పబ్లిక్ కుళాయిల సంఖ్య :	491
వ్యక్తిగత కుళాయిల సంఖ్య :	32 000

రోజు విడిచి రోజు నీటి సరఫరాకు చర్యలు..

మండు వేసవిలో నగర ప్రజలకు రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వేసవి ప్రణాళికలో భాగంగా అవసరమైన నిధులు ఖర్చు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. చంపావతి నదిలో నీటి నిల్వలు అడుగంటిపోవటంతో ఆంధ్ర రిజర్వాయర్ నుంచి 50 క్యూసెక్కుల నీటిని మళ్లించేలా చర్యలు చేపడుతున్నాం. అంతేకాకుండా మూడు రక్షిత మంచి నీటి పథకాల వద్ద నిర్వహణ పనులు చేపట్టనున్నాం.

– ఎం. మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్.

మరోసారి ఆశీర్వదించండి..



ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

- వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని 5, 15 డివిజన్‌లలో ఎన్నికల ప్రచారం

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడుతుందని, గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పాలనను చూసి మరోసారి ఆశీర్వదించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. నగరంలోని 5, 15వ డివిజన్‌లలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఆయా డివిజన్ల ప్రజలు కోలగట్లకు విజయ తిలకం దిద్ది, హారతులతో స్వాగతం పలికారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ అల్లు చాణక్య, గుజ్జల నారాయణరావు మాట్లాడుతూ, అభివృద్ధి ప్రదాతగా కోలగట్ల వీరభద్రస్వామి ఐదేళ్లలో చేసిన కృషి మరువరానిదన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ సంక్షేమ పాలన అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నగరం అన్ని రంగాలలో కుంటుపడిందన్నారు. కోలగట్ల వీరభద్రస్వామి నేతృతంలో ఐదేళ్లలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, మరోసారి ఆయనకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, 5వ డివిజన్ కార్పొరేటర్ గాదం మురళి, పార్టీ నాయకుడు కేఏపీ రాజు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని దీవించండి



పినతాడివాడలో ఇంటింటి ప్రచారంలో ఎంపీపీ వాసుదేవరావు, ఐటీ విభాగం ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్, ప్రదీప్ తదితరులు

డెంకాడ: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలి ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జోన్ -2 జోనల్ ఐటీ వింగ్ ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్, యువ నాయకుడు బడ్డుకొండ ప్రదీప్ కోరారు. వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడును, ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరుతూ మండలంలోని పినతాడివాడలో శుక్రవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించారన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కృషితో పినతాడివాడ ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి బడ్డుకొండ, బెల్లానలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లెంక లక్ష్మణరావు, కలిశెట్టి రామకృష్ణ, సువ్వాడ రమేష్, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చెంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ కోటినాయుడు, వాశ్లె వెంకటరావు, రేవళ్ల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం



ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ మేయర్ శ్రావణికి స్వాగతం పలుకుతున్న జొన్నవలస గ్రామ మహిళలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కోలగట్ల శ్రావణి

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రతిపక్ష నాయకుల కళ్లబొల్లి మాటలకు ప్రజలు మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి, బెల్లాన చంద్రశేఖర్ తరఫున విజయనగరం మండలం జొన్నవలసలో శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రావణి ఇంటింటి ప్రచారం నిర్వహించగా మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల 10 నెలల కాలంలో సంక్షేమం, అభివృద్ధే అజెండాగా పాలన సాగించారన్నారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ సచివాలయ వ్యవస్థతో సాకారం చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. నాడు - నేడు కార్యక్రమంతో ప్రభుత్వ బడుల రూపురేఖలే మార్చారన్నారు. పిల్లలు ఉన్నత చదువులు చదివేలా అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్య పథకాలను అందిస్తున్నారని చెప్పారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ఒకటో తరగతి నుంచే ఆంగ్ల మాధ్యమం అమలు చేశారని తెలిపారు. జగనన్న విద్యాకానుక, బైజూస్ ట్యాబ్‌లు, జగనన్న గోరుముద్ద వంటి కార్యక్రమాలతో పాఠశాల విద్యావ్యవస్థకు కొత్త రూపు తీసుకువచ్చారన్నారు. గ్రామాల్లో ప్రజలకు 24 గంటలు వైద్యం అందుబాటులో ఉండేలా వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేయడమే కాకుండా, జగనన్న సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలతో వారానికోసారి నిపుణులైన వైద్యులతో సేవలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకంతో ఉచితంగా కళ్లద్దాల పంపిణీ, శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన మేనిఫేస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. మహిళలకు ఆర్థికభరోసా కలిగించడానికి వైఎస్సార్ చేయూత పథకం, పావలా వడ్డీ, రుణ మాఫీ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రైతుల సంక్షేమానికి గ్రామాల్లోనే రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందిస్తున్నారన్నారు. ప్రతీ ఏటా రైతు భరోసా కింద పెట్టుబడికి రూ. 13,500 అందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కంది రమాదేవి, మాజీ సర్పంచ్ కంది గణపతి, అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



నందిగాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని నందిగాం, సుందరపేట గ్రామల్లో పార్టీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబుతో కలిసి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల మహిళలు ఎమ్మెల్యే బడ్డుకొండకు విజయ తిలకం దిద్ది, హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బడ్డుకొండ మాట్లాడుతూ, గడిచిన ఐదు సంవత్సరాలుగా జనరంజక పాలన సాగిస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలను అర్హులకు అందజేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డేనని కొనియాడారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రమం పనులు పూర్తయితే నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. త్వరలో విశాఖ నుంచి పాలన సాగనున్న నేపథ్యంలో వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. కూటమి అభ్యర్థి లోకం మాధవి, ఆమె భర్త ప్రసాద్ (మిరాకిల్ సంస్థ అధినేత) 20 సంవత్సరాల కిందట ఈ ప్రాంతానికి వలస వచ్చి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి రైతులను మోసం చేశారని ఆరోపించారు. అటువంటి వారు నేడు ఎన్నికల బరిలో ఉన్నారని, వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడ బాబు, పడాల భానుప్రకాష్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, వెంకటపతిరాజు, బైరెడ్డి యర్రప్పలనారాయణ, సర్పంచ్‌లు గరే మురళీమోహనరావు, కర్రోతు వెంకటరమణ, పూడిక నూకరాజు, కిలారి వెంకటరమణ, ఉప్పాడ శివారెడ్డి, కొమ్మూరు సుభోషణరావు పాల్గొన్నారు.

రెండో రోజు నాలుగు నామినేషన్లు

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి రెండో రోజు శుక్రవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే మీసాల గీతకు ఆ పార్టీ నుంచి టిక్కెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్లు సమర్పించగా, ఇందిరా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సుంకరి సతీష్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థిగా దుద్దు వెంకటరమణ నామినేషన్ వేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు.

నెల్లిమర్లలో...

నెల్లిమర్ల: నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి రెండో రోజు నలుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. జనసేన అభ్యర్థి లోకం నాగమాధవి మూడు సెట్ల నామినేషన్లు అందజేశారు. బీఎస్పీ అభ్యర్థిగా ఎరుకొండ తేజోరాణి, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా కర్రి కృష్ణ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా కేజే యేస్ నామినేషన్లు సమర్పించారు. మొత్తంగా రెండో రోజు నలుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం. నూకరాజు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



కొత్తపేట జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- పార్టీ విజయంలో జోనల్ వ్యవస్థదే కీలక పాత్ర
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను శనివారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు. నగరంలోని కొత్తపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జోనల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1, 2, 3, 12, 13, 14 డివిజన్‌లకు సంబంధించి పార్టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలుగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత సార్వత్రిక ఎన్నికలో జోనల్ వ్యవస్థ కీలకంగా నిలిచిందని, ఈ సారి కూడా పార్టీ విజయంలో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నగరం మరింత అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలన్నా, సంక్షేమ పాలన సాగాలన్నా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి ఏర్పాటు కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర చెల్లూరు జంక్షన్ వద్దకు చేరుకుంటుందని, అక్కడ జరిగే ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా బెల్లాన చంద్రశేఖర్‌ను, శాసనసభ్యుడిగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, కార్పొరేటర్లు బండారు ఆనందబాబు, అల్లు చాణక్య, ఇసరపు రేవతీదేవి, రేగాన రూపాదేవి, పార్టీ నాయకులు ముచ్చు శ్రీనివాసరావు, గదుల సత్యలత, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబామెట్టలో..

విజయనగరం: నగరంలోని బాబామెట్ట ప్రాంతంలో 4, 5, 6, 7, 10 డివిజన్లకు సంబంధించి ఏర్పాటు చేసిన జోనల్ కార్యాలయాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గాదం మురళి, మారోజు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కేఏపీ రాజు మీడియాతో మాట్లాడుతూ.. నగర అభివృద్ధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేసిన కృషిని ప్రజలు గుర్తించాలన్నారు. ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు.

ఆరో తరగతిలో ప్రవేశాలకు పరీక్ష రేపు

భోగాపురం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పార్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు.